సాక్షి ఒడిశా

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,88,848

బంగారం 1 గ్రాము 500 మిల్లీ గ్రాములు

వెండి 64 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



రైళ్ల రాకపోకలకు అంతరాయం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదివారం పలుచోట్ల పట్టాలపై నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

- 10లో

ప్రాణం మీదకు తెచ్చిన ఆట సరదా

సరదాగా పిల్లలు ఆడుకునే ఆట ప్రాణం మీదకి వచ్చింది.

- 10లో



న్యూస్‌రీల్

విజయోస్తు ..!



అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన పర్వతారోహకురాలు లిపికా సేథ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కలిశారు. ఈనెల 20న ఆమె ఆస్ట్రేలియా ఖండంలోని ఎత్తైన శిఖరం మౌంట్ కోజికోడ్‌ను అధిరోహించే యాత్రను ప్రారంభించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి లిపికా సేథ్‌ను అభినందించి, పర్వతారోహణ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. – భువనేశ్వర్

ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లూసీ దాస్



లూసీ దాస్

భువనేశ్వర్: కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల, ఆస్పత్రి కొత్త డీన్ మరియు ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ (డాక్టర్) లూసీ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ప్రొఫెసర్ డాక్టర్ లూసీ దాస్ వైద్య కళాశాల, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

మాజీ ఎమ్మెల్యే అశ్విని గురు మృతి



అశ్విని గురు

భువనేశ్వర్: మాజీ ఎమ్మెల్యే అశ్విని గురు (69) మృతి చెందారు. ఆయన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన 1980 నుంచి 1985 వరకు సంబలపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ సభ్యునిగా రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2018 నుంచి 2022 వరకు సంబలపూర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. బ్రజరాజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతిమ దర్శనం చేసుకుని నివాళులర్పించారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కొండచిలువ పట్టివేత



పట్టుబడిన కొండచిలువ

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీప సత్తిగూడ గ్రామంలో ఉన్న కోళ్ల ఫారంలో కొండ చిలువను కోళ్లఫారం వ్యాపారి గమనించారు. కోళ్లను కొండచిలువ తినేసి ఉండడంతో కదలలేని స్థితిలో ఉంది. దీంతో అతను గమనించి మల్కన్‌గిరి స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి స్వయంగా కొండచిలువను పరిశీలించి వైద్య పరీక్షలు చేయించి, సమీప అడవిలో వదిలేశారు.

భారీగా గంజాయి పట్టివేత



కంటైనర్‌లో దొరికిన గంజాయి, నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. చిత్రకొండ ఘాట్ రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా ఒక కంటైనర్‌ను పట్టుకున్నారు. కంటైనర్‌ను తనిఖీ చేయగా అందులో 12 బస్తాల్లో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తూకం వేయగా 420 కేజీలు ఉందని, దీని విలువ రూ.70 లక్షలు ఉంటుందని ఐఐసీ దీరెన్ పట్నాయక్ పేర్కొన్నారు. కంటైనర్‌లో ఉన్నటువంటి మహారాష్ట్రకు చెందిన అమోల్ శాంతారామ్ శంక్‌పాల్‌చ కమ్లేష్ జగన్నాథ్‌లను అరెస్టు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తారు.

వీడని వాన

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రానున్న రెండు రోజులు వర్షాలు కురిస్తే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: ఎస్‌కేసీజీ కళాశాల వద్ద వర్షం కురుస్తున్న దృశ్యం



కొరాపుట్: కొరాపుట్-జయపూర్ ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు



మల్కన్‌గిరి: కంగూర్ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



మల్కన్‌గిరి: నీటిలోనే ప్రమాదకరంగా రాకపోకలు చేస్తున్న దృశ్యం

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జుధిష్టర్ రౌళో తదితరులు

జయపురం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో అన్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ పంచాయతీ రుడిచువ గ్రామంలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఇందిరా అవాస యోజన, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనల్లో అవినీతి తారాస్థాయికి చేరుకుందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవ్వడం లేదని ప్రజలు ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తామని చెప్పిన బీజేపీ, అధికారంలోకి వచ్చాక కేవలం రూ.1 వేయి మాత్రమే అందజేస్తోందని మండిపడ్డారు. అలాగే అటవీ భూమి పట్టాలు అర్హులైనవారికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రసవ 'వే'దన

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా బోడపోదర్ పంచాయతీ మెటగూడ గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవ వేదనకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం మెటగూడ గ్రామానికి చెందిన బలి ఖీలో భార్య లక్ష్మి ఖీలోకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో పక్క గ్రామం పనసగొంది గ్రామంలో ఉన్న ఆశవర్కర్ పద్మా కిర్సనీకి ఫోన్ చేశారు. దీంతో ఆమె చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి ఫోన్‌చేసి, అంబులెన్స్ పంపించమని కోరింది. అయితే గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో రెండు కిలోమీటర్లు గర్భిణిని తీసుకురావాలని అంబులెన్స్ డ్రైవర్ సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమెను మంచంపై మోసుకొని తీసుకెళ్లారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ఆమెకు మగబిడ్డ పుట్టగా, తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు.



మంచంపై లక్ష్మిని మోసుకెళ్తున్న దృశ్యం

వసతి గృహంలో విద్యార్థిని మృతి



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు



అమరావతి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

కొరాపుట్: ప్రభుత్వ వసతి గృహంలో గిరిజన బాలిక మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి చౌరాముల్లా గ్రామంలోని కేజీబీవీ వసతి గృహంలో 6వ తరగతి విద్యార్థిని అమరావతి జాని(11) జ్వరంతో ఆదివారం అస్వస్థతకు గురైంది. దీంతో వసతి గృహ సిబ్బంది ఆమెని తెంతులకుంటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం ఆమె స్వల్పంగా కోలుకుంది. తర్వాత సిబ్బంది బాలికను తిరిగి వసతి గృహానికి తీసుకొచ్చారు. అయితే అక్కడ ఆమె అచేతనంగా పడిపోవడంతో మరలా ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో బాలిక స్వగ్రామం కొండిగుడ గ్రామ పంచాయతీ ముండిగుడ నుంచి వందలాది మంది గిరిజనులు ఆస్పత్రికి తరలి వచ్చారు. మృతదేహం చూసిన వెంటనే ఆందోళన చేపట్టారు. మృతురాలి తండ్రి దయా జానీ మాట్లాడుతూ శనివారం తాను వసతి గృహానికి వెళ్లేటప్పటికే తన కూతురు అనారోగ్యంతో ఉందని, ఆమెని ఇంటికి తీసుకొని వెళ్తానని చెప్పగా పంపడానికి సిబ్బంది నిరాకరించారని వాపోయాడు. సిబ్బంది నిర్లక్ష్యం వలనే తన కూతురు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెంతులకుంటి పోలీసులు కేసు నమోదు చేశారు.

సునీత ముండో సస్పెన్షన్



సునీత ముండో

భువనేశ్వర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణ కింద సునీత ముండోను భారతీయ జనతా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ సస్పెన్షన్ ఉత్తర్వులు ఆదివారం జారీ చేశారు. ఆమె భువనేశ్వర్ బీజేపీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు సునీతతో పాటు 5 మందిని సస్పెండ్ చేశారు. వీరిలో ఖుర్దా జిల్లా మాజీ అధ్యక్షుడు నికుంజ్ పట్నాయక్, కార్యదర్శి బిద్యుత్ కండి, జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు తపస్ జెనా, షెడ్యూల్డ్ కులాల మోర్చా అధ్యక్షుడు శివ మల్లిక్, ధనేశ్వర్ బారిక్ ఉన్నారు.

పట్నాగొడొ మండలాధ్యక్షుడు అరెస్ట్

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా పట్నాగొడొ మండల అధ్యక్షుడిని అరెస్ట్ చేశారు. మండల కార్యాలయం ప్రాంగణంలో అల్లర్ల కేసులో అధ్యక్షుడు నీలకాంత్ బాగ్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. శనివారం మండల కార్యాలయం ప్రాంగణంలో బీజేపీ, బీజేడీ కార్యకర్తల మధ్య ఘర్షణ పెచ్చుమీరి కొట్లాటకు దారి తీసింది. ఈ కొట్లాటలో ఇద్దరు బీజేపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువుర్ని భీమ్‌భొయి వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్నారు.

బీఈవో అరెస్టు

భువనేశ్వర్: గంజాం జిల్లా ఛత్రపురం మండల విద్యాశాఖాధికారి (బీఈవో) సీతారాం పాత్రోని విజిలెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై ఈ అధికారిని అరెస్టు చేశారు. విజిలెన్స్ దాడిలో బీఈవో అక్రమ ఆర్జిత ఆస్తుల్లో 3 పెద్ద భవనాలు, రూ.6.5 లక్షలు నగదు, బ్యాంకు డిపాజిట్లు రూ.35.61 లక్షలు ఉన్నట్లు గుర్తించారు.

ఎంపీ సప్తగిరికి అభినందనల వెల్లువ



ఎంపీ ఉల్కకి అభినందనలు తెలుపుతున్న కార్యకర్తలు

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని అతని నివాసానికి కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలి వెళ్లారు. త్వరలో జరగనున్న జార్ఖండ్ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తరుపున జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయనను ఏఐసీసీ నియమించింది. సప్తగిరి ఇప్పటికే మహారాష్ట్ర ఎన్నికల కమిటీలో అభ్యర్థుల ఎంపిక స్క్రీనింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సప్తగిరికి జాతీయ స్థాయిలో బాధ్యతలు పెంచడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. సప్తగిరి ఉల్క వరుసగా రెండుసార్లు కొరాపుట్ స్థానం నుంచి ఎంపీగా గెలిపొందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒడిశాలో కేవలం సప్తగిరి ఉల్క మాత్రమే ఎంపీగా ఈ రెండు విడతలు గెలిపొందారు.

బొరిగుమ్మ సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి శివశంకర మిశ్రతో బార్ అసోసియేషన్ సభ్యులు

జయపురం: ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ మిశ్ర శనివారం సాయంత్రం జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సందర్శించారు. బొరిగుమ్మ కోర్టుకు వెళ్లగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్ దొర నేతృత్వంలో అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కోర్టు పనులపై చర్చించిన అనంతరం నిర్మాణం జరుగుతున్న కోర్టు భవనాలను పరిశీలించారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టుకు వెళ్లే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం జరిగిన చర్చల్లో బొరిగుమ్మ బీడీవో, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

జేఈ ఇంట్లో కొనసాగుతున్న సోదాలు



రాణిగుడఫారంలో జేఈ ఇల్లు



సోదాలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు

రాయగడ: కాసీపూర్ సమితి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జేఈ పూర్ణచంద్ర చౌదరి ఇంట్లో విజిలెన్స్ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సమితి పరిధి మండిబిసి పంచాయతీలో మనోరేగ పనుల బిల్లులు చెల్లించేందుకు కాంట్రాక్టర్ వద్ద రూ.25 వేల లంచం తీసుకుంటూ శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులకు జేఈ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు చేపట్టిన సోదాల్లో రూ.14,81,300 నగదుతో పాటు 29 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడి భార్య పేరుపై రెండు ప్లాట్లు, టికిరిలో మరో ఇళ్లకు సంబంధించి దస్తావేజులను గుర్తించారు. కాగా బ్యాంకు లావాదేవీలకు సంబంధించి లాకర్ల విషయమై సోమవారం కూడా సోదాలు చేపట్టనున్నట్లు సమాచారం. జయపురానికి చెందిన విజిలెన్స్ డీఎస్పీ అరుణ్ కుమార్ నాయక్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు సంజయ్ కుమార్ ప్రధాన్, సావిత్ర ప్రధాన్, సరితా త్రిపాఠితో పాటు మరో 13 మంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.



దాడుల్లో పట్టుబడిన నగదు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అల్లిన గరం కూడలి సమీపంలో శనివారం అర్ధరాత్రి విశాఖపట్నం వైపు వెళుతున్న లగేజ్ వ్యాన్‌ను వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టింది. వర్షం కారణంగా మెల్లగా ముందు వాహనం వెళుతుండగా, కంటైనర్ అదుపు చేయలేక డ్రైవర్ ఢీ కొట్టారు. కంటైనర్ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ నరేష్ శర్మ, సహాయకుడు పస్వాన్ గాయపడ్డారు. 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. లగేజ్ వ్యాన్ డ్రైవర్ ప్రేమ్‌కుమార్ నటరాజన్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారికి గాయాలు

టెక్కలి రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని స్థానిక కంచ్ర వీధికి చెందిన చిన్నారి సమీరా గాయపడింది. ఆదివారం కంద్రవీధికి చెందిన సమీర అనే ఐదేళ్ల పాప రోడ్డు పై నడిచి వెళ్తుండగా బన్నువాడ నుంచి టెక్కలి వైపు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిన్నారి తలకు తీవ్రగాయాలు కాడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

ఘనంగా విశ్వహిందూ పరిషత్ షష్టి పూర్తి మహోత్సవం

కాశీబుగ్గ: పలాస శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సభాధ్యక్షురాలుగా శ్రీకాకుళం జిల్లా కళింగవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు మల్లా పద్మజ, ప్రధాన వక్తగా తొట్టింపూడి సునీతాదేవి వ్యవహరించారు. వక్తలు మాట్లాడుతూ 1964లో విశ్వ హిందూ పరిషత్‌ను స్థాపించారని తెలిపారు. హిందువులను సంఘటితం చేసేందుకు సంస్థ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు.

మృతుడు ఇచ్ఛాపురం వాసి



మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన హెచ్‌సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం బాహుదా నదిలో శనివారం రాత్రి లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిశాయి. మృతుడిని ఇచ్ఛాపురానికి చెందిన సువ్వారి నరసింహరాజు(35)గా బంధువులు ఆదివారం గుర్తించారని తెలిపారు. స్థానిక బెల్లుపడ కాలనీలో నివాసం ఉంటున్న నరసింహరాజు శుక్రవారం బహిర్భూమికి బహుదా నదికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో కొట్టుకుపోయి ఉండవచ్చని బంధువులు భావిస్తున్నట్లు తెలిపారు.

మానవత్వం చాటుకున్న హెచ్‌సీ

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడ కాలనీకి చెందిన సువ్వారి సత్యనారాయణ కుమారుడు నరసింహరాజు(పింటు) బాహుదా నదిలో గల్లంతై చనిపోయిన సంగతి తెలిసిందే. ఆయన అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేకపోవడంతో హెడ్‌కానిస్టేబుల్ తెలుకల రామారావు చొరవ తీసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. నీటిలో పడి రెండు రోజులు కావడంతో గుర్తుతెలియని మృతదేహంగా రూరల్ పోలీసులు గుర్తించి స్థానిక సీహెచ్‌సీలో భద్రపరిచారు. ఆదివారం సంబంధిత వివరాలను పోలీసులు కనుగొన్నారు. అయితే నరసింహరాజు తోడపుట్టిన నలుగురు అన్నదమ్ములు, తండ్రి కూడా మృతిచెందడంతో అంత్యక్రియలు నిర్వహించే వారు ఎవరూ లేరని తేలింది. దీంతో హెచ్‌సీ ముందుకువచ్చి మృతదేహానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో బాహుదానది శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం.చిన్నంనాయుడు, పట్టణ, రూరల్ ఎస్ఐలు చిన్నంనాయుడు, శ్రీనివాసరావు, ఇతర పోలీస్ సిబ్బంది హెచ్‌సీని అభినందించారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు తీవ్ర గాయాలు

టెక్కలి రూరల్: గూడేం పంచాయతీ పరిధి సన్యాసి నీలాపురం గ్రామంలో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై జె.ఈశ్వరి అనే వివాహిత గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈశ్వరి తన ఇంటి పెరటలో ఉన్న చెత్తను శుభ్రం చేస్తున్న క్రమంలో అక్కడ ఉన్న ఒక ఇనుప రాడ్డుని వేరే చోట పెట్టేందుకు తీసుండగా పై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.



గాయపడిన వ్యక్తి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రాణం మీదకు తెచ్చిన ఆట సరదా



చికిత్స పొందుతున్న జోగేశ్వర్ మాఝి

రాయగడ: సరదాగా పిల్లలు ఆడుకునే ఆట ప్రాణం మీదకి వచ్చింది. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ మటికొన ఆశ్రమ పాఠశాలలో ఉంటున్న విద్యార్థులు ఆదివారం కావడంతో సరదాగా అంతా కలిసి ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో జాదూఘర్ ఆటలు ఆడుదామని కొంతమంది అనడంతో అంతా సై అన్నారు. అనుకున్నదే మొదలు పిల్లలంతా కలిసి బ్లేడుతో ఆటలు మొదలుపెట్టారు. బ్లేడుతో కోస్తే ఏమీ జరగదని మ్యాజిక్ షోలో ఇటువంటివి చూపిస్తున్నారని భావించి ఆటని ప్రారంభించారు. దీంతో జోగేశ్వర్ మాఝి అనే విద్యార్థి మెడను మరో విద్యార్థి పదునైన బ్లేడుతో కోశాడు. రక్తస్రావం కావడంతో మాఝి స్పృహతప్పి పడిపోవడంతో అంతా భయంతో పారిపోయారు. విషయం తెలుసుకున్న ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు వెంటనే రక్తపు మడుగులోని విద్యార్థిని టికిరి పీహెచ్‌సీకి చికిత్స కోసం తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు.

కేంద్రాపడాలో బర్డ్ ఫ్లూ అనుమానం

భువనేశ్వర్: పూరీ జిల్లాలో కలకలం రేపుతున్న బర్డ్ ఫ్లూ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తున్నట్లు భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాపడా జిల్లాలో అనేక పక్షులు మరణించిన నేపథ్యంలో ఏవీఎన్ ఇన్‌ఫ్లూయెంజా వ్యాప్తి చెందిందని అనుమానిస్తున్నారు. పూరీ జిల్లా పిప్పిలి మండలంలో అనేక ప్రాంతాలు వ్యాధి బారినపడిన తర్వాత డెలాంగ్ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ ఆవిర్భవించినట్లు ధ్రువీకరించారు. డెలాంగ్‌లోని మొటొరి పంచాయతీ వద్ద ఉన్న కోళ్ల ఫారమ్ నుంచి సేకరించిన నమూనాలను పరీక్షించడంతో హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ పాజిటివ్ అని తేలడంతో ఈ ధ్రువీకరణ ఖరారు చేశారు. తదనంతర చర్యగా కల్లింగ్ ఆపరేషన్ ప్రారంభించారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు (ఆర్ఆర్‌టీ) ఇప్పటివరకు 3,200 పక్షులను చంపినట్లు (కల్లింగ్) పేర్కొన్నారు. ఒక కిలో మీటరు పరిధిలో ఉన్న 5 గ్రామ పంచాయతీల్లోని దాదాపు 74 కోళ్ల ఫారాల్లో 10 ఆర్ఆర్ బృందాలు కల్లింగ్ ఆపరేషన్ నిర్వహణకు సన్నద్ధం అవుతున్నాయి.

హాట్‌స్పాట్లుగా రెండు మండలాలు

పూరీ జిల్లా పిప్పిలి, డెలాంగ్ మండలాలు బర్డ్ ఫ్లూ హాట్‌స్పాట్‌లుగా పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం కోళ్ల ఫారాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ఇది కాకుండా జిల్లాలోని నిమ్మాపడా మండలం పరిధిలోని బలిపడా పంచాయతీలోని కోళ్ల ఫామ్‌లో కోళ్లని చంపి పూడ్చారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 2,000 కోళ్లను పూడ్చారు. సోమవారం ఈ పరిసర ప్రాంతాల్లో సుమారు 10,000 కోళ్లను చంపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కేంద్రాపడా జిల్లా డెరాబిస్ ఏరియా పరిధిలోని భైకియా గ్రామం వద్ద రోడ్డుపై బస్తాలలో ప్యాక్ చేసి చనిపోయిన కోళ్లు కనిపించడంతో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందని అనుమానిస్తున్నారు. అయితే చనిపోయిన కోళ్లను రోడ్డుపై పడేసిన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు. పూరీ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం చూపడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు.

జొరిగాం అడవుల్లో శివలింగం లభ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం అటవీ ప్రాంతంలో శివ లింగాన్ని గిరిజనులు గుర్తించారు. ఆదివారం పలియా పంచాయతీ పరిధి తిపాగుడ అటవీ ప్రాంతంలో శివలింగం, నంది విగ్రహం గిరిజనులకు కనిపించాయి. దీంతో వెంటనే ఆ ప్రాంతాలను శుభ్రపరిచి వాటికి అభిషేకాలు చేసి పూజలు జరిపించారు. ఈ వార్త తెలిసి వందలాది మంది గిరిజనులు ఆ ప్రాంతానికి తరలి వెళ్తున్నారు.

రెవెన్షా పేరు మార్పిడి దుమారం

భువనేశ్వర్: కటక్ మహా నగరంలో రెవెన్షా విశ్వవిద్యాలయం ఎంతో చారిత్రాత్మకమైనది. అయితే ఈ విద్యా సంస్థ పేరు మార్చాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రతిపాదించడంతో రాష్ట్రంలో తీవ్ర దుమారం చెలరేగుతోంది. ప్రధానంగా రాజకీయ, విద్యార్థి వర్గాల్లో వ్యతిరేకత పరిస్థితులను ప్రేరేపిస్తోంది. థామస్ ఎడ్వర్డ్ రెవెన్షా 1868లో కాలేజియేట్ పాఠశాలగా దీనిని స్థాపించారు. 1876లో పూర్తిస్థాయి డిగ్రీ కళాశాలగా మార్చబడింది. శతాబ్దాల పైబడి దీర్ఘ చరిత్ర కలగిన ఈ విద్యా సంస్థ నుంచి మాజీ ముఖ్యమంత్రులు హరేకృష్ణ మహతాబ్, నందినీ శత్పతి, బిజూ పట్నాయక్, ప్రముఖ చరిత్రకారుడు రమేష్ చంద్ర మజుందార్, భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్ మిశ్రా వంటి ఎందరో ప్రముఖులు పట్టభద్రులుగా ఉత్తీర్ణులై అత్యున్నత స్థాయిలో తళుక్కుమన్నారు. కటక్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. థామస్ ఎడ్వర్డ్ రావెన్షా పేరును యూనివర్సిటీకి పెట్టారని గుర్తు చేశారు. అయితే 1866 కరువు సమయంలో కమిషనర్‌గా ఆయన విఫలమవ్వడంతో ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆయన హయాంలో ఒడిశా చరిత్రలో విషాదకరమైన కాలానికి ప్రతీకగా నిలిచిందన్నారు. అందువలన నేటికీ ఆయన పేరుతో కొనసాగుతున్న ఈ సంస్థ పేరుని మార్చితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆయన వ్యాఖ్యలపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

రద్దయిన రైలు సేవలు		
తేదీ	స్టేషను	రైలు
సెప్టెంబర్ 2	నాందేడ్	20810 నాందేడ్ - సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 3	ఎల్‌టీటీ	18520 ఎల్‌టీటీ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	విశాఖపట్నం	20833 విశాఖపట్నం - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	సికింద్రాబాద్	20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్
సెప్టెంబర్ 2	ఇరువైపుల నుంచి	20707/20708 సికింద్రాబాద్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆదివారం పలుచోట్ల పట్టాలపై నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పలు రైళ్ల సేవలు రద్దు చేయగా, కొన్ని రైళ్ల సేవలను పాక్షికంగా రద్దుచేసి, మరి కొన్నింటిని దారి మళ్లించి నడిపిస్తున్నట్లు ప్రకటించారు.

పాక్షిక రద్దు

ఆదివారం సంబలపూర్ నుంచి నాందేడ్ బయల్దేరాల్సిన 20809 సంబల్‌పూర్ – నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు విశాఖపట్నం వరకు పరిమితం చేసి విశాఖపట్నం మరియు నాందేడ్ స్టేషన్ల మధ్య సేవల్ని పాక్షికంగా రద్దు చేశారు.



దారి మళ్లింపు		
తేదీ	రైలు	దారి మళ్లింపు
సెప్టెంబర్ 1	20819 పూరీ - ఓఖా ఎక్స్‌ప్రెస్ ఖుర్దా రోడ్	విశాఖపట్నం, విజయనగరం, రాయగడ, టిట్లాగడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా..
సెప్టెంబర్ 1	20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్	విజయనగరం, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా..
సెప్టెంబర్ 1	11020 భువనేశ్వర్ - ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్	విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్ మీదుగా..
సెప్టెంబర్ 2	12803 విశాఖపట్నం - నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్	విజయనగరం, రాయగడ, టిట్లాగడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ మీదుగా..
సెప్టెంబర్ 1	18520 ఎల్‌టీటీ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఎల్‌టీటీ	సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు మీదుగా...
సెప్టెంబర్ 1	12804 నిజాముద్దీన్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్	నిజాముద్దీన్, నాగ్‌పూర్, రాయ్‌పూర్, టిట్లాగడ్, రాయగడ, విజయనగరం మీదుగా...
సెప్టెంబర్ 1	11019 ముంబై - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్	ముంబై, సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా..

సంక్షిప్తంగా...!

విరామ సైనిక సిబ్బంది నియామకం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం ఆనంద బజార్ ప్రాంగణంలో విరామ సైనిక సిబ్బందిని నియమించారు. ఆనంద్ బజార్ మరియు మందిర ప్రాకారం పరిసరాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం 20 మంది విరామ సైనిక సిబ్బందిని నియమించారు. వీరిలో 10 మంది చొప్పున 2 విడతల్లో ఆనంద్ బజార్ ప్రాంగణంలో విధుల్లో పాల్గొంటారు. ఆనంద్ బజార్ కార్యకలాపాలు సంస్కరణ కార్యాచరణలో భాగంగా ఈ చర్యని చేపట్టారు.

భారీగా పోస్టులు భర్తీ

భువనేశ్వర్: రాష్ట్ర పోలీసు వ్యవస్థను పటిష్టం చేయనున్నట్లు సీఎం మోహన్ చరణ్ మాఝీ అసెంబ్లీలో పేర్కొన్నారు. ఈ మేరకు భారీగా పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దీంతో చట్టపరమైన చర్యలు అమలు చేసే సిబ్బందికి అనుకూల పరిస్థితులు నిరంతరం అందుబాటులో ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెరుగుతున్న కల్తీ సారా మృతులు

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం జెనాపూర్ గ్రామంలో కల్తీసారా ఘటన మరో వ్యక్తి ప్రాణాలను పొట్టనపెట్టుకుంది. ఈ విచారకర సంఘటనలో కొరొబలువా గ్రామానికి చెందిన బయా సెతి ఆదివారం కన్ను మూశాడు. దీంతో కల్తీసారా మరణాల సంఖ్య 4కి చేరింది. బరంపురం ఎంకేసీజీ ఐసీయూలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఇంతకు ముందు ఈ ఘటనలో 3 మంది చనిపోయిన విషయం తెలిసిందే. వీరిలో జెనాపూర్ గ్రామస్తులు చెందిన జురా బెహెరా, లోక్‌నాథ్ బెహెరా మరియు లక్ష్మణ్ బెహెరా ఉన్నారు. ప్రస్తుతం మరో ముగ్గురు కల్తీ సారా బాధితులు ఎంకేసీజీ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

బాబురావు మహంతికి సన్మానం



బాబురావుని సన్మానిస్తున్న రారసం సభ్యులు

రాయగడ: ప్రముఖ కవి, రచయిత, సంఘ సేవకుడు, విశ్రాంత హెచ్ఎం డాక్టర్ బాబురావు మహంతికి రాయగడ రచయితల సంఘం (రారసం) ఆదివారం ఘనంగా సన్మానించింది. స్థానిక హోటల్ రాజ్‌భవన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో ఆయనకు సంఘం అధ్యక్షుడు టీవీఎస్ఆర్ అప్పారావు, కళాభిమానులు జీడీ చౌదరి, బార్జి ప్రసాద్‌రావు తదితరులు పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. గోవాలో ఆదిలీల ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన నేషనల్ భారత్ సమ్మిట్‌లో ఆయనకు గ్లోబల్ అచీవర్స్ ఎక్స్‌లెన్స్ అవార్డును ఇచ్చి సన్మానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక రచయితల సంఘం ఈ మేరకు సన్మానించింది.

బ్రౌను షుగర్‌తో పట్టుబడిన విద్యార్థులు

భువనేశ్వర్: రాష్ట్ర అబ్కారీ విభాగం సిబ్బంది ఆదివారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో విద్యార్థుల దగ్గర బ్రౌను షుగర్ పట్టుబడింది. ఈ వ్యవహారంలో 3 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు బీటెక్ విద్యార్థులు. వీరి వద్ద 275 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెటు విలువ రూ. 25 లక్షలు ఉంటుందని అంచనా. ముగ్గురు నిందితులు ఆదివారం ఉదయం కారులో ఖుర్దా నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా తనిఖీ అధికారుల దృష్టిలో పడ్డారు. అధికారుల నుంచి తప్పించుకుని దూసుకుపోయేందుకు విఫలయత్నం చేశారు. స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి పరిసరాల్లో వీరి కారుని అదుపులోకి తీసుకుని మాదక ద్రవ్యాల రవాణా గుర్తించారు. ఇద్దరు స్నేహితులు సుబ్రజ్యోత్, రాహుల్‌తో మరో యువతి అనామిక తనిఖీ అధికారులకు చిక్కారు. ఖుర్దా నుంచి కొనుగోలు చేసిన బ్రౌను షుగర్‌ని క్యాంపస్‌లో తోటి విద్యార్థులకు అమ్మి సొమ్ము చేసుకోవడంతో మాదక ద్రవ్యాల మత్తుకు అలవడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

రేషన్ బియ్యం ఇప్పించాలని ఆందోళన



రేషన్ కార్డులతో ఆందోళన చేస్తున్న జగదీష్ మజ్జి తదితరులు

కొరాపుట్: తన పంచాయతీకి రేషన్ బియ్యం ఇప్పించాలని సర్పంచ్ స్వయంగా ఆందోళన చేపట్టారు. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి ఇచ్ఛాపూర్ గ్రామ పంచాయతీలో ఈ పరిస్థితి నెలకొంది. సర్పంచ్ జగదీష్ మజ్జి మాట్లాడుతూ పంచాయతీలోని డెపాగుడ, కడమాలి, కర్షపాడ, సింధిపడ, ఆదివాసిపడ గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో 3 నెలలకు ఒకసారి, మరికొన్ని గ్రామాల్లో 6 నెలలకు ఒకసారి బియ్యం పంపిణీ చేస్తున్నారని వాపోయారు. ఈ సమస్యపై తాను సమితి సర్వసభ్య సమావేశాల్లో లేవనెత్తినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో తాము ఆందోళన చేస్తున్నామని ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక న్యూకాలనీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సదరు సమితి పరిధిలోని గజ్జిగాంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో మొత్తం 91 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఎలుగుబంటి స్వైర విహారం

కొరాపుట్: ఎలుగు బంటి దాడిలో బాలుడికి గాయాలైన ఘటన నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి బరకోడి గ్రామంలో చోటుచేసుకుంది. గురు శాంత అనే బాలుడు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, పొదల నుంచి ఎలుగు వచ్చి అతనిపై దాడి చేసింది. అయినప్పటికీ అతను చాకచక్యంగా పక్కనున్న దిగువ భాగంలోనికి దూకి ఇంటికి చేరుకున్నాడు. అతని కాలుకి రెండుచోట్ల ఎలుగుడాడి వలన తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు డాబుగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేశారు.



చికిత్స పొందుతున్న రతన్ జాని

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి కమర గ్రామ పంచాయతీ ముండిగుడ పొలాల్లో ఎలుగుబంటి హల్‌చల్ సృష్టించింది. ఆదివారం ఆ గ్రామంలో ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన రతన జాని అనే రైతు సమీపంలోని తనపొలం వద్దకు వెళ్లగా దాడి చేసింది. వెంటనే క్షతగాత్రుడిని బొరిగుమ్మ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ అతడికి ప్రథమ చికిత్సం చేసి మెరుగైన వైద్యం కోసం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రాజకీయ పార్టీలతో కలెక్టర్ భేటీ



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభంకర్

కొరాపుట్: రాజకీయ పార్టీల ప్రతినిధులతో నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో సమావేశమయ్యారు. 2025 జనవరి 1వ తేదీలోపు ఓటర్ల జాబితా సవరణ పూర్తవుతుందన్నారు. అంతలోపు 4 విడతలుగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో మున్న త్రిపాఠి(కాంగ్రెస్), ప్రమోద్ కుమార్ రథ్(బీజేడీ), సరోజ్ బెహరా (బీజేపీ), ఏడీఎం మహేష్ చంద్ర నాయక్ తదితరుల పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొరాపుట్: బ్రహ్మపుర నగరంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మొత్తం 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్, కోశాధికారి ఎం.కిరణ్ కుమార్, కార్యదర్శి సత్యకం పాత్రో తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



పిల్లల పార్క్ ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పట్టణంలోని పలు కూడళ్ల అందంగా తీర్చడానికి పర్లాకిమిడి పురపాలక సంఘం శ్రీకారం చుట్టింది. ముక్తా పథకం కింద సుభాష్ నగర్‌లో మినీ పార్కు, మూడో వార్డులో శిశు ఉద్యానం, పెద్ద బ్రాహ్మణ వీధి జంక్షన్ వద్ద మినీ పావిలియన్‌లను ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, వైస్ చైర్మన్ లెంక మధు, పట్టణ బీజేడీ అధ్యక్షుడు సుధీర్ మహాపాత్రో, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మాజీ సైనికుల భేటీ



కలెక్టర్‌తో మాజీ సైనికులు

రాయగడ: జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారిని రాయగడ జిల్లా మాజీ సైనికుల సంఘం సభ్యులు శనివారం భేటీ అయ్యారు. సంఘం అధ్యక్షుడు శివ ప్రసాద్ రథ్, సాధారణ కార్యదర్శి సుర్జిత్ హోతా నేతృత్వంలో సంఘం సభ్యులు పాల్గొని కలెక్టర్‌కు పలు సమస్యలను వివరించారు. జిల్లాలో సైనిక్ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఈసీహెచ్ఎస్ పాలీక్లినిక్, క్యాంటిన్ వంటి సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు.

నకిలీ పోలీసు అరెస్టు

భువనేశ్వర్: భద్రక్‌కు చెందిన సుభాష్ చంద్ర కంవర్ అనే వ్యక్తిని కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. బూటకపు పరిచయంతో ఒక మహిళను వివాహం చేసుకుంటానని మోసగించిన ఆరోపణ కింద అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందే బూటకపు వ్యవహారంతో రెండు పెళ్లిళ్లు చేసుకుని ఇద్దరు భార్యలతో కాపురం చేస్తున్నట్లు విచారణలో తేలింది. 2020లో సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ద్వారా ఖుర్దాకు చెందిన 52 ఏళ్ల మహిళకు సుభాష్‌తో పరిచయం ఏర్పడింది. రౌర్కెలాలో పోలీసు అధికారిగా పని చేస్తున్న మనోజ్ మిశ్రాగా తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఇలా మాయ మాటలతో మురిపించి పెళ్లి వరకు సాగదీసి వైవాహిక జీవితానికి ప్రేరేపించాడు. తదనంతరం మహిళ ప్రతిపాదనను అంగీకరించింది. దీంతో వీరిద్దరు 2023 ఆగస్టులో వివాహం చేసుకున్నారు. అయితే వారి పెళ్లి తర్వాత సుభాష్ అలియాస్ మనోజ్ ఆమెను దూరం పెట్టడం ప్రారంభించాడు. ఆమె కుటుంబాన్ని కలవడానికి కూడా వెనుకాడడంతో మెల్లగా డొంక కదిలింది. ఎట్టకేలకు అత్త వారింట్లో గుట్టు రట్టు అయింది. అతని కార్యకలాపాలపై మొదటి నుంచి అనుమానం ఉన్న కుటుంబ సభ్యులు అతని కారు రిజిస్ట్రేషన్ నంబర్‌ను ట్రాక్ చేయడం ద్వారా అతను మోసగాడు అని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు ఖండగిరి ఠాణా పోలీసులు సుభాష్ చంద్ర కంవర్‌ను అరెస్టు చేశారు. నకిలీ ఆధార్ కార్డు, గుర్తింపు కార్డు, పోలీసు యూనిఫాంలో ఉన్న ఫోటోలు, వివాహ ఫోటోలు వంటి నేరారోపణలను బలపరిచే సాక్ష్యాధారాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు భద్రక్ రూరల్ పోలీస్ ఠాణా పరిధిలోని తుంబపడికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం అతడు రౌర్కెలాలోని సెక్టార్ 14 ప్రాంతంలో నివసిస్తున్నాడు. తదుపరి విచారణలో ఆ వ్యక్తికి మూడు పెళ్లిళ్లు అయినట్లు తేలింది. అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించనున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.



సుభాష్ చంద్ర కంవర్

రాత్రివేళలో ఇసుక దందా

సాక్షి టాస్క్‌ఫోర్స్: బూర్జ మండలం మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపు నుంచి రాత్రిపూట ఇసుక తరలిపోతోంది. సాయంత్రం ఆరు గంటల తర్వాత అనుమతులు లేకుండా ఇష్టానుసారం ఇసుకను తీసుకుపోతున్నారు. ఇక్కడ అధికారికంగా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తే రాత్రి ఇలా అక్రమాలు జరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. స్థానిక నాయకుడు సనపల సురేష్ ఇప్పటికే అన్ని శాఖలకు సమాచారం తెలియజేశారు.



కాఖండ్యాం ర్యాంపు నుంచి రాత్రి వేళలో తరలిస్తున్న ఇసుక

కోర్టు ఆదేశాలు ధిక్కరించినా..

నరసన్నపేట: స్థానిక బొంతల వీధిలోని పిండి మిల్లు వ్యవహారంలో అధికారుల ద్వంద్వ వైఖరి విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ కోర్టు ఆదేశాల మేరకు పిండిమిల్లుకు తాళం వేయగా.. కొందరు టీడీపీ నాయకులు తాళాలను బ్రేక్ చేసి షాపు తెరిచారు. ఇది కోర్టు ధిక్కారమే అవుతుందని స్థానికులు చెబుతుండగా.. ఆ మిల్లును ఇప్పుడు రన్ చేయడం ప్రారంభించారు. అయినా అధికారులు కిక్కురుమనడం లేదు. మిల్లును పాత పద్ధతిలో రన్ చేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీని వల్ల శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం వస్తోందని అంటున్నారు. ఈ వ్యవహారంలో మొదటి నుంచి ఫిర్యాదు దారుల తరఫున కోర్టులో వాదిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది డీవీరావు మాట్లాడుతూ ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులకు కంటెమ్ట్ నోటీసు ఇచ్చామని దీని గడువు సెప్టెంబర్ 3వ తేదీతో ముగుస్తుందని అన్నారు. ఈ లోగా మిల్లు రన్నింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోతే కోర్టులో కంటెమ్ట్ దాఖలు చేస్తామని తెలిపారు.



పిండి మిల్లును రన్ చేస్తున్న మహిళ

అకారణంగా తొలగిస్తున్నారు

గార: వమరవల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పదేళ్లకు పైబడి పని స్థానిక గొర్లెవానిపేట గ్రామస్తులు పనిచేస్తున్నారు. వారిలో కుక్, అటెండర్, ఇద్దరు హెల్పర్లకు ఒకటో తేదీ నుంచి పనికి రావద్దని చెప్పారు. శనివారం సాయంత్రం వరకు పనిలో ఉన్నామని, ప్రిన్సిపాల్ పిలిచి రేపటి నుంచి మీ నలుగురు రావద్దని చెప్పారని చాట్ల లత, బెవర పుణ్యవతి, బలగ జ్యోతి, బెవర గన్నెమ్మలు తెలిపారు. తామంతా వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చామని, అందుకే కూటమి నాయకుల ఒత్తిడితోనే ఇదంతా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో పని చేస్తున్న వారిని కాకుండా కొత్తగా ఇద్దరిని తీసుకోవడంతో వివాదం చోటుచేసుకుంది. స్కూల్ గేట్ వద్ద వారంతా ఆదివారం ఉదయం ఆందోళన చేశారు. మద్దతుగా కొందరు గ్రామస్తులు చేరడంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారులకు వినతులు అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ చిట్టిలత వద్ద ప్రస్తావించగా వర్కర్లందరూ రోజువారి వేతనదారులుగానే పని చేస్తున్నారని, పది మంది ఉండగా వేతనం ఎక్కువగా ఉండడంతో పది మందిని సర్దుబాటు చేసుకోవాలని చెప్పానని, ఏడుగురు వస్తున్నారని తెలిపారు.

క్లుప్తంగా

కూలిపోయిన పెంకుటింటి గోడ



కూలిన ఇంటిగోడను పరిశీలిస్తున్న తహసీల్దార్ డి.రవి

పాచిపెంట: ఇటీవల కురుస్తున్న వర్షాలకు శనివారం అర్ధరాత్రి పాచిపెంట మండలంలోని కర్రివలస గ్రామానికి చెందిన పడాల వెంకటేశ్వరరావు పెంకిటింటి గోడ కూలిపోయింది. ఆ సమయంలో వెంకటేశ్వరరావు, భార్య ఇంట్లోనే నిద్రపోతున్నారు. గోడవెలుపల వైపు కూలడం వల్ల ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ డి.రవి సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.నివేదికను ఆర్‌డీఓ, కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ డి.రమణారావు, వీఆర్‌ఓ బి.మురళి ఉన్నారు.

మరో ఇంటి గోడ..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడ గ్రామానికి చెందిన ఎప్పరిక నరసింహులు ఇంటికి సంబంధించిన ఓవైపు గోడంతా ఆదివారం కురిసిన వర్షానికి కూలిపోయింది. అయితే ఆ సమయంలో నరసింహులు, కుటుంబసభ్యులు ఇంటి వద్ద లేకపోవడంతో పెనుప్రమాదమే తప్పిందని వైస్ సర్పంచ్ తాడంగి ధనుంజయరావు తదితరులు తెలిపారు. వీఆర్వో గౌరమ్మ ఆ గ్రామానికి వెళ్లి నిర్ధారించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

గ్యాస్ లారీ బోల్తా



బోల్తా పడి పొలాల్లో ఉన్న గ్యాస్ లారీ

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస కూడలి వద్ద జాతీయ రహదారిపై గజపతినగరం నుంచి ఒడిశాకు గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ ఆదివారం తెలిపారు. భారీ వర్షాలు పడడంతో రోడ్డుపై నెమ్మదిగా వెళ్తున్నప్పటికీ లారీ బరువుతో ఉండడంతో బోల్తా పడి పక్కన పొలాల్లోకి వెళ్లి పోవడంతో..ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్‌లు కూడా ఎలాంటి ప్రమాదం లేకుండా బయట పడడంతో క్రేన్ సహాయంతో లారీని బయటకు తీయించనున్నట్లు చెప్పారు.

భారీ కొండ చిలువ హతం



హతమార్చిన భారీ కొండ చిలువ

భామిని: మండల కేంద్రలోని డీఎస్‌ఆర్ కాలనీలో ఆదివారం భారీ కొండ చిలువను రైతులు హతమార్చారు. ఇటీవల వర్షాలు కురిసి వంశధార నదిలోకి వరద నీరు రావడంతో సమీప పొలాల గుండా కొండ చిలువ తరలి వచ్చిందని స్థానికులు తెలిపారు. సుమారు 6 అడుగుల పొడవున్న కొండచిలువను హతమార్చిన రైతులు గ్రామంలోని వీధుల్లో తిప్పగా గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు



ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టి గెడ్డ

మక్కువ: అల్పపీడన ప్రభావం కారణంగా కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు గోముఖి రెగ్యులేటర్ ద్వారా ఆదివారం 300 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. అలాగే మండలంలోని కవిరిపల్లి, సరాయి వలస, బంగారువలస గ్రామాల వద్ద గోముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏజెన్సీ గ్రామాలలో వర్షాలు కురవడంతో మార్కొండపుట్టి, తెలగడవలస గ్రామాల సమీపంలోని చిట్టగెడ్డకు వరద ఉధృతి పెరిగింది. కవిరిపల్లి గ్రామం సమీపంలోని కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహిస్తుండంతో సుమారు 10 గ్రామాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నది పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

- మహిళా సంఘాలకు తలనొప్పిగా ఆటో డెబిట్ విధానం
- శ్రీ నిధి రుణాలకు ఆటో డెబిట్ విధానం
- కొందరు సభ్యులు రుణం తీసుకున్నా..
- అందరు సభ్యుల పొదుపు సొమ్ము నుంచి డెబిట్
- రుణం తీసుకోని సభ్యులకూ తప్పని తిప్పలు



సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

రుణం కొందరిది.. భారం అందరిది..!

సాలూరు: రుణం తీసుకుంది కొందరైతే..ఆ రుణం చెల్లింపు భారం అందరిదీ అనే విధంగా కూటమి ప్రభుత్వం ఆటో డెబిట్ విధానాన్ని తీసుకువచ్చిందని పలువురు మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. పొదుపు మహిళా సంఘాల శ్రీ నిధి రుణాల చెల్లింపుల్లో ఆటో డెబిట్ విధానం ప్రవేశపెట్టి, వారి పొదుపు సొమ్ముతో రుణాలు రికవరీ చేసే విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ విధానం అమలవుతోందని, పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ విధానం ఇంకా అమలుకాలేదని అధికారులు చెబుతున్నప్పటికీ, ఇది అమలైతే ఎదురయ్యే సమస్యలపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీతో పాటు శ్రీ నిధి సంస్థ ద్వారా రుణాలు ఇస్తు న్నారు. సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ) ఆధ్వర్యంలో ఈ రుణం పంపిణీ జరుగుతుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈ ప్రక్రియను నిర్వహిస్తుంది. శ్రీ నిధి బ్యాంకు ద్వారా జిల్లాలో మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులకు రుణాలు ఇస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 19,803 మహిళా సంఘాల్లో 2,29,315 మంది సభ్యులు ఉన్నారు.

గతంలో రుణం చెల్లింపు ఇలా..

సంఘంలో సభ్యులందరూ లేదా కనీసం ముగ్గురు కంటే ఎక్కువ మంది శ్రీ నిధి ద్వారా రుణం తీసుకుంటారు. సంఘానికి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తారు. ఈ రుణాన్ని సంఘంలో సభ్యులంతా లేదా అవసరాన్ని బట్టి కొందరైనా తీసుకుంటారు. ఏదైనా సంఘంలో ముగ్గురు లేదా నలుగురు సభ్యులు రుణం తీసుకుంటే సదరు సభ్యులు ఆ సొమ్మును ప్రతి నెలా వాయిదాల రూపంలో చెల్లించేవారు. ఒకనెల ఏదైనా కారణం వల్ల చెల్లింపు చేయకుంటే మరుసటి నెలలో రెండు నెలల వాయిదా సొమ్మును చెల్లించేవారు. సంఘంలో ఎక్కడైనా ఆ వాయిదా సొమ్ము చెల్లిం చని వారిని మిగిలిన సభ్యులు గుర్తించి వారిపై ఒత్తిడి తీసుకువచ్చి వాయిదాలు సక్రమంగా చెల్లించేలా ప్రయత్నించేవారు.

సంఘాల సభ్యుల మధ్య వివాదాలకు ఆస్కారం

సంఘంలో అందరు సభ్యులు రుణాలు తీసుకుని, అందరు సక్రమంగా చెల్లింపులు చేస్తే ఫర్వాలేదు. అలాకాకుండా కొందరే రుణాలు తీసుకుని, కొందరు సక్రమంగా చెల్లింపు చేయకుంటే సంఘంలో సభ్యుల మధ్య వివాదాలు ఏర్పడే అవకాశం ఉంది.

అందరి సభ్యుల పొదుపు డబ్బు ఆటోడెబిట్

అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డెబిట్ విధానం వల్ల సంఘ సభ్యుల పొదుపు సొమ్ము ఖాతా నుంచి వాయిదాలను కట్ చేసుకుంటారు.సంఘంలో రుణం తీసుకున్న సభ్యులు సకాలంలో వాయిదాలు చెల్లించకపోయినా, సంఘం సభ్యులందరి పొదుపు ఖాతానుంచి డబ్బు నిర్ణీత తేదీకి ఆటోమేటిక్‌గా బదిలీ అయిపోతుంది. దీనివల్ల ముఖ్యంగా రుణం వాడని సభ్యులకు నష్టం చేకూరే పరిస్థితి ఉంది.రుణం తీసుకోకుండా పొదుపు నగదు జమచేసిన వారి డబ్బు శ్రీ నిధికి చెల్లింపైపోయే ప్రమాదముంది. అందరూ రుణం తీసుకుంటే ఏ సమస్య ఉండదు కానీ రుణం తీసుకోని సభ్యులకే ఈ సమస్య ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రతినెలా కొంత డబ్బు పొదుపు చేసుకుంటూ, రుణాలు తీసుకోని సంఘ సభ్యులు ఈ ఆటో డెబిట్ విధానం వల్ల అధికంగా నష్టపోయే ప్రమాదముందని వాపోతున్నారు. సంఘంలో మిగిలిన సభ్యులు రుణాలు తీసుకుంటే, మేమంతా దాచుకున్న పొదుపు సొమ్మును కట్ చేయడం సమంజసం కాదని, ఈ విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు. రుణాలు తీసుకున్న సభ్యుల నుంచే చెల్లింపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విధానం అమలుపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

జిల్లాలో ఇంకా ప్రారంభం కాలేదు

ఆటోడెబిట్ విధానం జిల్లాలో ఇంకా అమలు కాలేదు. మండల ఏపీఎంలు, సీసీలు ఈ విధానం కావాలనుకుంటే నేరుగా బ్యాంకు లకు వెళ్లి ఆటో డెబిట్ విధానానికి అంగీకరిస్తే ఈ విధానం అమలవుతుంది.

–హేమలత, ఏజీఎం, పార్వతీపురం మన్యం జిల్లా

14 మంది సోషల్ టీచర్లకు సత్కారం



సత్కారం పొందిన సోషల్ టీచర్లతో డీఈఓ ప్రేమ్‌కుమార్

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యలో సాంఘిక శాస్త్ర అధ్యయనం సామాజిక చైతన్యాన్ని విద్యార్థికి ఇస్తుందని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ అన్నారు. ఏపీ సోషల్ స్టడీస్ టీచర్ల ఫోరం జిల్లా కమిటీ అధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన అవగాహన సదస్సు, ఉత్తమ సోషల్ టీచర్ల సత్కారం కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ టీచర్ల బోధన వల్లే విద్యార్థి ప్రవర్తన, వక్తిత్వ వికాసాన్ని మంచి మార్గంలో తీర్చి దిద్దవచ్చన్నారు. అనంతరం సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులుగా ఉత్తమ సేవలందించిన 14 మంది టీచర్లను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మతోపాటు ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో లెంక తిరుపతిరావు, పీవీసూర్యకాంతం, బుదరాయవలస శ్రీనివాస్, వోలేటి సత్యనారాయణ, మక్కువ బాలకృష్ణ, కేవీసుధాకర్, చెన్నాపురం చిరంజీవి రావు, కోరాడ జయ, ఎస్.అప్పారావు, బూరాడ శ్రీనివాసరావు, బొండపల్లి దుర్గయ్య, బలివాడ వేణుగోపాలరావు, జామి ఈశ్వరరావు, కంటి పరుశునాయుడు ఉన్నారు. సంఘం అధ్యక్షుడు ఎస్.రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు, డివ్యూటీ ఈఓలు కేవీరమణ, మోహనరావు, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసి రాజు, ప్రధానోపాధ్యాయులు డి.రాము, బి.శంకర రావు, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.ఎల్లం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుపతిరావు, జిల్లావ్యాప్తంగా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దగెడ్డ నుంచి 220 క్యూసెక్కుల నీరు విడుదల



పెద్దగెడ్డ జలాశయం రెండవ నంబర్ గేటు ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

పాచిపెంట: పెద్దగెడ్డ జలాశయం రెండవ నంబర్ గేటు ద్వారా 220 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈలు రవికుమార్, వెంకట్‌లు ఆదివారం తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో దిగువకు నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తహసీల్దార్ పరిశీలన

పెద్దగెడ్డ జలాశయం నీటి విడుదలను తహసీల్దార్ డి.రవి పరిశీలించారు. నీటి విడుదలకు సంబంధించిన వివరాలను జేఈలను అడిగి తెలుసుకున్నారు. దిగువప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అదేశించారు.

వాటర్ డ్రమ్ములో పడి చిన్నారి మృతి



మోక్షిత్ (ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని దేవాంగుల వీధిలో నివాసముంటున్న వెంగల నారాయణరావు దంపతుల కుమారుడు చిన్నారి మోక్షిత్(1)ప్రమాదవశాత్తు నీళ్ల డ్రమ్ములో పడి మృతిచెందాడు. నారాయణరావు బతుకు తెరువుకోసం పట్టణానికి గతేడాది వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటూ విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవలే మోక్షిత్ పుట్టినరోజు వేడుకలను చుట్టుపక్కల వారిని పిలిచి తల్లిదండ్రులు ఘనంగా చేశారు. మోక్షిత్ ఆదివారం వర్షం కురుస్తున్న నీళ్ల డ్రమ్ము వద్దకు వెళ్లి ఆడుతూ పొరపాటున కాలుజారడంతో అందులో పడిపోయి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. దీంతో చిన్నారి మృతదేహంవద్ద తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారు కన్నీటి పర్యంతమయ్యారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి



అప్పల నర్సమ్మ (ఫైల్)



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని ఎం.కొత్తవలసలో ప్రమాదవశాత్తు చెరువులో పడి గ్రామానికి చెందని వృద్ధురాలు కంది అప్పలనర్సమ్మ (75) మృతిచెందినట్లు బొండపల్లి ఎస్సై మహేష్ తెలిపారు.మృతి చెందిన వృద్ధురాలికి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక కలెక్టరేట్ గణేష్ టెంపుల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం అందుకున్నామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని, సమీపంలో విచారణ చేయగా ఎటువంటి సమాచారం లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

సూర్యఘర్‌తో వెలుగులు

- సోలార్ ప్యానల్స్ ద్వారా ఇంటిలోనే విద్యుదుత్పత్తి
- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలు
- సబ్సిడీతో రుణ సదుపాయం

సోలార్ రూఫ్ టాప్ సామర్థ్యం

సామర్థ్యం	ఉత్పత్తి యూనిట్లు (నెలకు)	ఆదా (ఏడాదికి)	రాయితీ (ఏడాదికి)
1కిలోవాట్	120	రూ.8,000	రూ.30,000
2కిలోవాట్	240	రూ.20,000	రూ.60,000
3కిలోవాట్	360	రూ.32,400	రూ.78,000



సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్

పార్వతీపురం: సహజ వనరులను వినియోగించుకునే విధంగా కేంద్రం పథకాలు ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన తీసుకొచ్చింది. అందుకు అవసరమైన మేరకు రాయితీ అందిస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది.

విద్యుత్ వాడకం మేరకు..

విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్, ప్రస్తుతం వాడే మీటర్ స్థానంలో నెట్‌మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి, వినియోగదారు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుంది.

30 రోజుల్లో సబ్సిడీ..

నెట్‌మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. దీంతో సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ (ఒక మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. కిలో వాట్ సోలార్ రూటార్ ప్యానల్ నెలకు దాదాపు 125కు పైగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్‌ను సూర్యుడి వేడి పీల్చుకోవడంవల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

దరఖాస్తు ఇలా..

ఈ పథకంలో చేరాలంటే ముందుగా సూర్య ఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీలను జత పరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఇది మంచి పథకం

వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తుంది. నెట్ మీటరు విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

–కె. వేణుగోపాలరావు నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్, పార్వతీపురం మన్యం జిల్లా.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



చాంపియన్స్ ట్రోఫీతో జిల్లాకు చెందిన మహిళా వెయిట్ లిఫ్టర్లు

నెల్లిమర్ల రూరల్:

అనకాపల్లి జిల్లాలో మూడు రోజుల పాటు జరిగిన 11వ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో బంగారు, వెండి పతకాలను సాధించి చాంపియన్స్‌గా నిలిచారు. పురుషుల సబ్ జూనియర్ అండ్ సీనియర్ టీం చాంపియన్ షిప్‌తో పాటు మహిళల సబ్ జూనియర్ అండ్ సీనియర్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు నిర్వాహకులు చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఆదివారం అందజేశారు. సత్తా చాటిన క్రీడాకారులకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

గణేశ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

- శాంతియుతంగా నిర్వహిచుకోవాలి
- అల్లర్లు, సంఘర్షణలకు కమిటీ సభ్యులదే బాధ్యత
- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: వినాయక చవితి పండగను పురస్కరించుకుని జిల్లాలో గణపతి పందిళ్లు, మంటపాల ఏర్పాటుకు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను శాంతియుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిర్వహించుకోవడానికి పోలీసుశాఖకు ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలను నిర్వహించే వారు కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవ్ డాట్.నెట్‌లో నిర్దేశించిన చలానా రుసుం చెల్లించి, అనుమతులు పొందాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ మతసామరస్యాన్ని పాటించాలని, ఇతర మతాల వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా కమిటీసభ్యులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

రికార్డింగ్ డ్యాన్స్‌లు నిషేధం

సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించరాదని హెచ్చరించారు. ఉత్సవాలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించినట్లయితే సంబంధిత పంచాయతీ/ మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు పొందాలని పేర్కొన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో సంబంధిత స్థల యజమానుల అనుమతులు తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఉత్సవాలలో వినియోగించే మైక్‌లు, సౌండ్ బాక్సులతో ప్రజలకు ఇబ్బందులకు గురిచేయకూడదని, నిర్దేశించిన సమయం, నిర్దేశించిన సౌండ్‌ను మాత్రమే వినియోగించాలని, అందుకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించినా, ఊరేగింపుల్లో బాణసంచా వినియోగించినా, బలవంతపు వసూళ్లకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

పట్టుబడిన తుపాకీ కాల్పుల నిందితులు

- ముగ్గురి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన బొబ్బిలి డీఎస్పీ



సంఘటన వివరాలను వెల్లడిస్తున్న బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు. వెనుకన ముసుగులో ఉన్న నిందితులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి–రాజాం ప్రధాన రహదారిలో గరివిడి మండలం అప్పన్నవలస జంక్షన్ వద్ద ఆగస్టు 21వ తేదీ రాత్రి 11గంటల సమయంలో బంగారు వర్తకులపై కారం చల్లి, తుపాకీతో బెదిరించి కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన వివరాలను గరివిడి పోలీస్‌స్టేషన్‌లో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు ఆదివారం వివరించారు.ఈ కేసుకు సంబంధించి దిల్వార్ హుస్సేన్ మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితుల కోసం పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారంతా పశ్చిమబెంగాల్‌కు చెందిన ముస్లింలని తెలిపారు.


బాధితులు, నిందితులు పశ్చిమ బెంగాల్ వాసులే

ఈ సంఘటనలో బాధితులుగా, నిందితులుగా ఉన్న వారంతా పశ్చిమబెంగాల్ నుంచి వచ్చి స్థిరపడి బంగారు వస్తువులను సేకరించి వ్యాపారం చేస్తుంటారని తెలిపారు. ఈ సంఘటనలో ప్రధాన నిందితుడైన చీపురుపల్లిలో నివాసం ఉంటున్న మొబారక్ మొల్ల..బాధితుల వ్యాపార లావాదేవీలను గమనించి దోపిడీ చేసేందుకు ముందుగా ప్రణాళిక వేశాడు. ఈ క్రమంలో పశ్చిమబెంగాల్‌లో నివాసం ఉంటున్న బప్పి, రహీంలను ఆగస్టు 13,14 తేదీల్లో చీపురుపల్లికి రప్పించి మెట్టకాలనీలో వారికి వసతి కల్పించాడు. ఆ నిందితులతో పాటు రాజాంలో ఉంటున్న సఫీరుద్దీన్ గాజా, పార్వతీపురానికి చెందిన అబ్బీర్ హుస్సేన్‌లతో కలిసి ముందస్తుగా వేసిన ప్రణాళిక మేరకు ఆగస్టు 21వ తేదీన రాజాం ప్రాంతానికి చెందిన బంగారు వర్తకులు షేక్ నజీర్, దిల్వార్ హుస్సేన్ మాలిక్‌లు ఆరోజు సాయంత్రం బంగారు వ్యాపారం నిమిత్తం విజయనగరం వెళ్లి పని ముగించుకుని అదే రోజు రాత్రి రాజాం వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈ సమాచారాన్ని ముందుగా ఫోన్‌ల ద్వారా తెలుసుకుని, దోపిడీ చేసేందుకు అప్పన్నవలస జంక్షన్‌కు వద్దకు చేరుకున్నారు.

బాధితులు అప్పన్నవలస జంక్షన్ వద్దకు చేరుకునే సరికి వారిపై దాడి చేసి తుపాకీతో బెదిరించి కాల్పులు జరపగా వర్తకులు వారి వద్ద ఉన్న బంగారాన్ని తుప్పల్లోకి విసిరేశారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న రెండు ఫోన్లు, రూ.2800 రూపాయల నగదు దోచుకుపోయారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేయగా గరివిడిలోని పెనుబర్తి జంక్షన్ వద్ద కేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ముబారక్ మొల్ల, సఫీరుద్దీన్‌గాజీలను, పాలకొండలో అబ్బీర్ హుస్సేన్‌ను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు బప్పి, రహీంలను అరెస్టు చేయాల్సి ఉందని, వారికోసం తీవ్రంగా గాలింపు జరుగుతోందని తెలిపారు.

గిరిజన సంప్రదాయాలతో జ్ఞాన వ్యవస్థలకు సంరక్షణ

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: గిరిజన కళలు, సంగీతం, నృత్య సంప్రదాయ ఆచారాల ద్వారా సాంస్కృతిక కథనాలు, జ్ఞాన వ్యవస్థల సంరక్షణ జరుగుతుందని గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'ఇండిక్ ట్రైబాలజీ' కోర్సు ప్రారంభిస్తున్న సందర్భంగా ఆ కోర్సు అంశంపై రెండు రోజులుగా జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వారసత్వాన్ని ఆధునిక విద్యతో అనుసంధానించడంలో ఆదివాసీ జ్ఞానాన్ని పరిరక్షించడం తదితర అంశాలలో ఇలాంటి సదస్సులు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. నూతన విద్యా విధానం – 2020లో మార్గదర్శకాలు ఆధారంగా గిరిజన జ్ఞానం, సంప్రదాయాలను అభివృద్ధి చేయడం, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక మార్పిడిని పెంపొందించడం, ఆర్థిక అవకాశాలను సృష్టించడంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. అనంతరం సదస్సుకు రీసోర్స్‌పర్సన్‌లుగా వ్యవహరించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్ మాజీ డీన్ ప్రొఫెసర్ పంచానన్ మోహంతి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ బీపీఎస్ జోజో, తిలక్, మహారాష్ట్ర విద్యాపీఠం పూణేకు చెందిన డాక్టర్ మంజరి బోలేరావు, ఐజీఎన్‌టీయూకి చెందిన డాక్టర్ జగన్నాథ బోరాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, డీన్లు ప్రొఫెసర్ సారత్ చంద్రబాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.సురేష్‌బాబు, సమన్వయకర్తలు డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.ప్రసాద్, డాక్టర్ నగేశ్, డాక్టర్ ఎస్‌పీఎస్ సూర్యనారాయణ, లైబ్రేరియన్ డాక్టర్ దాసరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.